క్లుప్తంగా

ఆత్మీయ సత్కారం


భూమనకు పుష్పగుచ్ఛం ఇస్తున్న లలితా థామస్

తిరుపతి మంగళం: తిరుపతి పద్మావతి పురంలో చిత్తూరు, తిరుపతి జిల్లాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు భూమన కరుణాకరరెడ్డిని ఆదివారం పూతలపట్టు మాజీ ఎమ్మెల్యే లలితాథామస్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛంతో సత్కరించారు. ఉమ్మడి జిల్లా రాజకీయ పరిణామాలపై కొంతసేపు మాట్లాడారు.

నేడు 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక'

తిరుపతి తుడా: నగర పాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక, 10.30 నుంచి 11.30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ నిర్వహిస్తామని నగర పాలక సంస్థ కమిషనర్ ఎస్.మౌర్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమస్యలపై ఫోన్ ద్వారా ఫిర్యాదులు చేసేవారు 0877–2227208 నంబర్‌కు కాల్ చేయాలని కోరారు.

సిటీమార్ట్ ప్రారంభం


భూమనను సత్కరిస్తున్న సిటీమార్ట్ నిర్వాహకులు

తిరుపతి మంగళం: తిరుపతి ఆటోనగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన సిటీమార్ట్‌ను ఆదివారం చిత్తూరు, తిరుపతి జిల్లాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు భూమన కరుణాకరరెడ్డి ప్రారంభించారు. తిరుపతి నగర ప్రజలకు నాణ్యమైన నిత్యావసర సరుకులను అందుబాటు ధరలకు ఇవ్వాలని సిటీమార్ట్ యజమాని ప్రతాప్‌రెడ్డికి ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎంఆర్‌పల్లె వైఎస్సార్‌సీపీ నాయకులు తిమ్మారెడ్డి పాల్గొన్నారు.

నృత్యం..మంత్రముగ్ధం


భరతనాట్యం చేస్తున్న కళాకారులు

చంద్రగిరి: తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో వారాంతపు కార్యక్రమంలో భాగంగా ఆదివారం తిరుపతికి చెందిన శ్రీపద్మ కళాక్షేత్రం డ్యాన్స్ అకాడమి చిన్నారుల శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పలు భక్తిగీతాలు, కీర్తనలకు కళాకారులు లెనిషా, వెనిషా, లక్ష్మణ, మనస్విని, ఇంద్రాణి, సాయి సంజన, జయశ్రీ, కుషిశ్రీ, కులశ్రీ, పూజిత తమ నృత్యంతో ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని చేశారు. అనంతరం ఏఓ సుధాకర్ కళాకారులను సత్కరించి జ్ఞాపికలను అందజేశారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల: తిరుమల శ్రీవారిని ఆదివారం సినీ నటి గౌరీ ప్రియ, దర్శకుడు ఉద్భవ్ రఘు, మంత్రులు నారాయణ, సవిత, ఎంపీలు బీ.నాగరాజు, బీకే.పార్థసారథి నారాయణ దర్శించుకున్నారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు ఆశీర్వచనం పలికారు. టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలు అందజేశారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

తిరుపతి మంగళం: తిరుపతి జీవకోన పరిధిలోని సత్యనారాయణపురం, రాఘవేంద్ర నగర్, మాధవ నగర్ ప్రాంతాలలో రోడ్డు విస్తరణ పనుల కారణంగా సోమవారం నుంచి మూడు రోజులపాటు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయనున్నట్లు మాధవ నగర్ సబ్ స్టేషన్ ఏఈ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు.

అక్రమ నిర్మాణాలు తొలగించాలని ధర్నా

- హామీ నెరవేర్చని చంద్రగిరి ఎమ్మెల్యే నాని
- సీపీఎం నేత కందారపు మురళి విమర్శ


ఆర్డీఓకు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

తిరుపతి మంగళం: మంగళం తిరుమలనగర్ పంచాయతీ సర్వే నంబర్ 195లోని ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలను వెంటనే తొలగించి పేదలకు ఇవ్వాలని సీపీఎం నాయకులు కందారపు మురళి డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఎం భూ పోరాటంలో భాగంగా తుడా క్వార్టర్స్‌లో సర్వే అకాడమికి ఇచ్చిన ప్రభుత్వ భూమిలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ బొమ్మల క్వార్టర్స్ నుంచి తుడా క్వార్టర్స్ వరకు సీపీఎం నాయకులు ర్యాలీ నిర్వహించారు. అయితే తిరుచానూరు పోలీసులు, రెవెన్యూ అధికారులు అడ్డుకోవడంతో జోరువానలోనే రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. సమాచారం అందుకున్న ఆర్డీఓ రామ్‌మోహన్, తిరుపతి అర్బన్ తహసీల్దార్ సురేష్‌బాబు సీపీఎం నాయకులు కందారపు మురళితో మాట్లాడారు. అనంతరం కందారపు మురళి మాట్లాడుతూ, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని తాను ఎమ్మెల్యేగా గెలిచిన మూడు నెలల్లోనే స్థానికులకు స్థానికంగానే టిడ్కో ఇళ్లు నిర్మించి ఇచ్చేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారని, అయితే కూటమి ప్రభుత్వం వచ్చి 16 నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు ఆయన హామీ నెరవేర్చలేదని విమర్శించారు. మరోవైపు అధికార పార్టీకి చెందిన కొందరు సర్వే నంబర్ 195/2, 4లోని ప్రభుత్వ స్థలంలో తమకు పట్టాలు ఉన్నాయంటూ ఇళ్ల నిర్మాణానికి పూనుకున్నారని, పేదల ఇళ్ల కోసం కేటాయిస్తామని చెప్పిన చోట ఇళ్లు నిర్మిస్తుంటే చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై పరిశీలించి చర్యలు తీసుకుంటామని, అలాగే అర్హుల జాబితాను కలెక్టర్‌కు అందజేస్తే ఆరు నెలల్లో అందరికీ ఇళ్లు వచ్చేలా చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీఐ సునీల్, ఎస్‌ఐ జగన్నాథరెడ్డి, ఆర్‌ఐ రామచంద్ర, రెవెన్యూ అధికారులు, సీపీఎం నాయకులు సుబ్రహ్మణ్యం, వేణుగోపాల్, మునిరత్నం, జయచంద్ర, మాదవ్, సాయిలక్ష్మి, మోదిన్, శ్రీనివాసులు, స్థానికులు పాల్గొన్నారు.

వేడుకగా భక్త కనకదాసు విగ్రహావిష్కరణ


భక్త కనకదాసు విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి, మాజీ మంత్రులు, కురబ కుల పెద్దలు

తిరుపతి కల్చరల్: తిరుపతి ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని సర్కిల్లో భక్త కనకదాసు విగ్రహావిష్కరణ ఆదివారం వేడుకగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కర్నూలు రాజ్యసభ సభ్యుడు నాగరాజు, రాష్ట బీసీ వెల్ఫేర్, జౌళి శాఖ మంత్రి సవిత, కర్ణాటక మాజీ మంత్రి రేవన్న, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, యాదవ్ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్ , ఐ అండ్ పీఆర్ మంత్రి కె.పార్థసారథి, బెంగళూరు కనకదాస మఠం సిద్ధరామానందస్వామి, కురబ కుల పెద్దలు హాజరయ్యారు. తొలుత బాలాజీ కాలనీలోని పూలే విగ్రహం నుంచి విగ్రహావిష్కరణ వేదిక వరకు ర్యాలీ చేశారు. అనంతరం రామతులసీ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి సవిత మాట్లాడారు. తమ నాన్న పేరిట విగ్రహాన్ని వితరణ చేయడం సంతోషకరమన్నారు. కురబ కులస్తులకు ఏ అవసరం ఉన్నా సాయం చేస్తానని ప్రకటించారు. కర్ణాటక మాజీ మంత్రి రేవన్న మాట్లాడుతూ, రాష్ట ప్రభుత్వం కురుబ భవన్ మంజూరు చేస్తే..భవనానికి కావాల్సినవి సమకూర్చుతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో శ్రీభక్త కనకదాసు విగ్రహ స్థాపన కమిటీ సభ్యులు, కురబ కుల సంఘ నేతలు పాల్గొన్నారు.

చౌడేశ్వరికి సారె సమర్పణ


సారె తీసుకెళుతున్న హర్షిత్ రెడ్డి, గ్రామస్తులు

భాకరాపేట: యర్రావారిపాలెం మండలం, చెరుకువారిపల్లె పంచాయతీలోని వంకమద్దివారిపల్లెలో నూతనంగా నిర్మించిన శ్రీ చౌడేశ్వరిదేవి ఆలయ మహా కుంభాభిషేకం ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి వైఎస్ఆర్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి సారె సమర్పించారు. తొలుత ఆయనకు గ్రామపెద్దలు సాదర స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనానంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆ తర్వాత గ్రామస్తులతో హర్షిత్‌రెడ్డి మాట్లాడారు. ఆలయం చాలా బాగా కట్టించారని, అమ్మవారి ఆశీస్సులతో పల్లెలన్నీ పాడిపంటలతో కళకళలాడాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో యర్రావారిపాళెం మండలానికి చెందిన వైఎస్ఆర్‌సీపీ నేతలు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

బహుజన హక్కుల సాధనే లక్ష్యం

- డిసెంబర్ 28న బహుజన ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: అనాదిగా అణచివేతకు గురవుతున్న బహుజనుల హక్కుల సాధనే లక్ష్యంగా డిసెంబర్ 28న బహుజన ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చింతమాకుల పుణ్యమూర్తి తెలిపారు. ఆదివారం ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఆత్మీయ సమ్మేళనం కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్రంలో బహుజనులను ఓటు బ్యాంకుగా వాడుకోవడం మినహా వారి అభివృద్ధిని ప్రభుత్వం విస్మరిస్తోందని విమర్శించారు. ఉద్యోగాలలో రిజర్వేషన్లు కల్పించకపోవడంతో మరింత వెనుకబాటు, వివక్షకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సమ్మేళనం నిర్వహణకు పూనుకున్నామని, పాత కేఎల్ఎం హాస్పిటల్ వెనుక జీవగ్రామం, గాజులమండ్యం హైవే సర్కిల్‌లో డిసెంబర్ 28న దీనిని నిర్వహించనున్నట్లు చెప్పారు. జిల్లాలోని బహుజనులు, ఉద్యోగులు, యువజన, విద్యార్థి సంఘాలు హాజరు కావాలని కోరారు. సమావేశంలో బహుజన ఉద్యోగుల సమాఖ్య నేతలు సంగీతం సుబ్రమణ్యం, ప్రధాన కార్యదర్శి పద్మనాభం, సంయుక్త కార్యదర్శి రఘురాములు, తోట ప్రపాత్ ,మునీశ్వరయ్య గౌడ్, మధుమోహన్, మహేష్, భాస్కర్ పాల్గొన్నారు.

అపూర్వ కలయిక



పూర్వ విద్యార్థులు ఒక్కటయ్యారు. 1985-86 ఎస్వీ హైస్కూల్ తిరుమల టెన్త్ క్లాస్ బ్యాచ్ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. స్థానిక వరదరాజనగర్‌లోని మెడికల్ హాల్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు.

- తిరుపతి తుడా

నాలుగు దశాబ్దాల స్నేహగీతం!


సమ్మేళనానికి హాజరైన పూర్వ విద్యార్థులు

చంద్రగిరి: స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 1981–82లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం బుచ్చినాయుడుపల్లెలో మామిడితోటలో పూర్వవిద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. తమ ఉన్నతికి బాటలు వేసిన గురువులను సన్మానించారు. పూర్వ విద్యార్థి రామకృష్ణమూర్తి మాట్లాడారు. మలివిడత సమావేశంలో 1981 బ్యాచ్ విద్యార్థులు కుటుంబ సభ్యులతో హాజరయ్యేందుకు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో '1981 టెన్త్ క్లాస్ బ్యాచ్' పేరిట ట్రస్ట్ ఏర్పాటు చేశారు. స్కూలు అభివృద్ధికి విరాళమిచ్చారు. సమావేశంలో చంద్రశేఖర్, మోహన్ కుమార్, కేశవులు, సోమశేఖర్, టి.చంద్రశేఖర్, రవిచంద్ర, కిషోర్, వెంకటేశ్వర్లునాయుడు, గోపాలస్వామి, జానకీ రామాచారి, చంద్రశేఖర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

చలో విజయవాడ విజయవంతం చేయండి

పాకాల: ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యల పరిష్కారం కోసం ఫ్యాప్టో రాష్ట్ర శాఖ తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదివారం ఉమ్మడి చిత్తూరు జిల్లా కో–చైర్మన్ బి.రామమూర్తి ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. బీటీఏ రాష్ట గౌరవ సలహాదారు గుండ్లపల్లి ఆంజనేయులు మాట్లాడుతూ, 12వ పీఆర్సీ కమిటీ నియమించి ఐఆర్ 30 శాతం ప్రకటించాలని, రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్ బెనిఫిట్స్ ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న 4 డీఏలను ప్రకటించి, ఏకీకృత సర్వీస్ రూల్స్‌కి సంబంధించి 72, 73, 74 జీఓలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీటీఏ నాయకులు ఆదికేశవులు, కృష్ణమూర్తి, శివప్రసాద్, జ్యోతిప్రసాద్, జ్యోతి వెంకటరత్నం, విజయమోహన్, రామచంద్రయ్య, జయబాల, రాజేంద్రుడు పాల్గొన్నారు.